ఆ ఊరు, పరిసరాలు, ప్రకృతి, శీతోష్ణస్థితి, మనుష్యులు, భాష, ఆఫీసు—అన్నీ కొత్తే! ముందు రోజు రాత్రి షిల్లాంగు చేరాడు రాజశేఖరం. మరునాడు ఉదయం ఎనిమిది గంటలకు ఉద్యోగంలో చేరాడు. చివరికి ఉద్యోగంకూడా కొత్తదే! ఇన్ని కొత్తదనాలు ఒక్కుమ్మడిగా కలిసి అతడిని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

కృష్ణారావు పక్కన నిలబడి స్టోర్సును గురించి, తను చేయవలసిన పనిని గురించి విపులీకరించి చెబుతున్నాడు. కృష్ణారావు తనని గూర్చి తీసుకున్న శ్రద్ధను చూస్తూంటే రాజశేఖరానికి కృతజ్ఞత పెల్లుబికి, గొంతులో అడుపడి మాట రానీయడంలేదు. తన కింకా ఏ ఉద్యోగమూ దొరకలేదని తెలియడమే తడవుగా పెద్దగాంపిమీద పిలిపించి ఉద్యోగం వేయించాడు మరి.

చలి తీవ్రంగా ఉంది. ప్రాస్తూంటే వేళ్ళు వంకరలు పోతున్నాయి. భారతదేశమంతటా ఎండలు మండిపోతూంటే, షిల్లాంగు ప్రజలు చలికి తట్టుకోలేక పోతున్నారు. ఈ ప్రకృతి విడ్డూరాన్ని చూచి రాజశేఖరం విస్మయపోయాడు.

రెండు గంటలు సాఫీగా దొర్లిపోయాయి. అనతి దూరంలో గోడలా అమర్చిన బొగ్గులపొయ్యి వెచ్చదనాన్ని అందిస్తూంది. కుర్చీలోనుండి లేచి బద్ధకం విరిచి పక్కనున్న కిటికీ దగ్గరకు వెళ్లి బయటికి చూచాడు.

వాతావరణం మబ్బుగా ఉంది. లోయలలో దట్టంగా పెరిగిన దేవదారు వృక్షాల గుంపులలో ఇళ్ళు అందానికి వన్నెలు దిద్దుకుని కనిపిస్తున్నాయి. కుడిపక్క తమ లోయ ఉన్న కొండ ఏటవాలు ఉపరితలంలో రోడ్డు మీద కారు పోతూంది. ఎటు చూచినా సమతల ప్రదేశం కనిపించదు. ఆ ఖాసీకొండల ఏటవాళ్ళలో వెలసిన షిల్లాంగు నగరశోభను తిలకిస్తూ మైమరిచి పోయాడు రాజశేఖరం.

"షివ్!" మృదువుగా, సంగీతంలా వినిపించింది ఆ స్వరం. ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూచాడు. చూచి అచేతనుడయిపోయాడు. తన ఉనికిని మరిచిపోయాడు. మస్తిష్కంలో మరో ఆలోచన లేదు. అతని శరీరమంతా ఆమె రూపంతో నిండిపోయింది.

ఏ దేశంలోగాని యువతీయువకులమధ్య అనురాగం ప్రేమగా మారటం ఒకే తీరులో జరుగుతుంది. తాను ప్రేమించిన యువతి తన ప్రేమను గౌరవించి, అంగీకరించి, మనసున మమతలు పండించుకున్నా, తాను ఇచ్చిన బహుమానం ప్రేమకానుక అని ఆ యువకుడు తెలుసుకోలేక పోయినప్పుడు, ఆ హృదయాలు కన్నీట తడిసి, అద్దాలవలె పగిలిపోతాయి.

అచేతనంగా నిలబడిపోయిన రాజశేఖరం వైఖరి వాలకాన్ని చూచి ఆమె కొండ సెలయేరులా గలగలా నవ్వింది. ఒక్క ఉదుటున ఇహంలోకి వచ్చి పడ్డాడు రాజశేఖరం. ఎట్టఎదట ఆ అమ్మాయి వనదేవతలా నిలబడిఉంది. చూడగానే ఖాసీయువతి అని గుర్తుపట్టాడు. ఉదయం ఆఫీసుకు వస్తున్నప్పుడు దారిలో కొంతమంది స్త్రీల వేషభాషలు చూచి, వాళ్లను గూర్చి కృష్ణారావును అడిగాడు. ఖాసీకొండలపై నివసించే కొండజాతివారని, వారిని ఖాసీలంటారని, వారు మాట్లాడే భాషనుకూడా ఖాసి భాష అంటారని తెలుసుకున్నాడు.

## కన్నె ప్రభాకర గోపాలరావు

ఆ సుందరిని పరిశీలనగా చూచాడు. ఆమెది పచ్చని శరీరచ్ఛాయ. నిగనిగలాడే నిండైన పిక్కలపై జీరాడే గులాబీలు అద్దకం చేసిన గౌను. వక్షోజాలను కప్పుతూ మెడకి గచ్చకాయరంగు కాశ్మీరుశాలువా చుట్టి కట్టింది. శాలువాను ముందుకు తోసుకుని వచ్చి ప్రముఖంగా కనిపిస్తూంది వక్షోజద్వయం. ఈసారు ఆమె ముఖాన్ని చూచాడు. నిగనిగలాడే ఆమె గుండ్రని ముఖాన్ని చూచి చంద్రబింబమని భ్రమించాడు. కొంచెం తప్పడగా ఉన్నా చిగురు' మొనదేరిన నాసిక కత్తిమొనని జ్ఞాపకం తెచ్చి గగుర్పాటు పుట్టిస్తూంది. మినమినలాడే ఆమె నిండైన బుగ్గలను చూస్తూంటే అతను ఏదో తెలియని తృప్తి అనుభవించాడు. ఆనందానికి నెలవయిన ఆమె నీలిరంగు కళ్ళు గుప్పించే కాంతిపుంజాలలో పరిసరాలు పంచ రంగులలో కనిపించాయి. తల రింగుముడి వేసుకుంది. కాస్త చుబుకం మీదికెత్తి రాణిలా హుందాగా నిలబడి ఉంది ఆ అందాలరాణి!

ఆమె అందాన్ని, లావణ్యాన్ని చూచి జంకిపోయాడు రాజశేఖరం. మతి భ్రమించినవాడిలా అయిపోయాడు. ఆమెని కన్నెత్తి చూచే ధైర్యం లేక నేలచూపులు చూడసాగాడు. సూర్యునిముందు దీపం స్థితికి, తన స్థితికి ఏమీ తేడా లేదని అయిష్టంగానే నిర్ధారించుకున్నాడు.

"షివ్!" మళ్లీ అంది స్నేహపూర్వకంగా నవ్వుతూ. 'మల్లెల సమూహం ఒక్కసారి వికసించినట్లుంది ఆ నవ్వు' అనుకున్నాడు రాజశేఖరం. ఆమె చేతిలో టీ కప్పు ఉంది. టీ తీసుకోమంటుందని తెలుసుకున్నాడు. గాభరాపడిపోతూ టీ కప్పు అందుకుని, కంగారు తింటూ, గడగడా టీ తాగబోయాడు. పొగలు కక్కుతున్న టీ నోట్లోకి వెళ్ళగానే పెద్ద ఆర్తనాదం చేయబోయి, అమ్మాయిముందు సిగ్గుచేటని జ్ఞాపకం తెచ్చుకున్నవాడై, అతి కష్టంమీద శబ్దస్థాయి అదుపులో పెట్టినా, ఓ చిన్న వెర్రికేక పెట్టక తప్పలేదు. నోట్లో టీ సగం గుటకపడి, మిగతా సగం అతని బట్టలని పాడుచేసింది. ఆ అమ్మాయి అతని అవస్థ చూచి మెలికలు తిరుగుతూ పకపకా నవ్వసాగింది.

కృష్ణారావు దగ్గిరకి వచ్చి, "టీ అలా పొగలు కక్కుతూంటే ఎలా నోట్లో పోసేసుకున్నావురా, రాజా" అంటూ ఆప్యాయంగా మందలించాడేగాని, రాజశేఖరం కంగారు గుర్తించలేదు.

"సరాగ్గా ఉన్నాను" అంటూ గొణిగాడు రాజా.

"ఇప్పుడు మీరు మాట్లాడిన భాష ఏది?" ఆంగ్లంలో ప్రశ్నించింది ఆమె.

"మా మాతృభాష! తెలుగు!" జవాబిచ్చాడు కృష్ణారావు.

"అంటే, మద్రాసీ భాషా?" అడిగింది.

"అవును" అని చెప్పి తన కుర్చీవేపు సాగిపోయాడు కృష్ణారావు.

"అదేమిటి, అవునంటావు. సరిగ్గా చెప్పు." మాతృభాషాభిమాని రాజశేఖరం చిరాగ్గా అన్నాడు.

"నాకు టైం లేదు! అదేదో నువ్వే చెప్పు!" అని ఆఫీసు పనిలో తల దూర్చాడు కృష్ణారావు.

రాజశేఖరం ఆ సుందరితో ఏదో చెప్పబోయాడు. కాని నోరు పెగలలేదు. ఇది గమనించి, "ఏమిటి?" అని ఆమే చనువుగా అడిగింది. ఆ చనువు చూచి కొంచెం ధైర్యం పుంజుకుని, "మద్రాసీ అంటే తెలుగు కాదు. మద్రాసు రాష్ట్రంవాళ్లు తమిళం మాట్లాడుతారు. ఉత్తరాదివేపు అందరు దక్షిణ భారతీయులందరిని మద్రాసీ అనడం పరిపాటి. కాని దక్షిణ భారతంలో నాలుగు రాష్ట్రాలున్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల వాళ్లు వేర్వేరు భాషలు మాట్లాడుతాయి. మాది ఆంధ్రప్రదేశ్. మా రాష్ట్రంఅంతా తెలుగు మాట్లాడు

# ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## ముఖ్య గమనిక

మాకు పంపే వ్యాసాలు, కథలు, చిత్రాలు వగైరాలతోపాటు తగినన్ని స్టాంపులు అంటించి, తమ అడ్రసు వ్రాసిన కవరు పంపాలి. అలాంటప్పుడే ప్రచురించలేనివాటిని వెనక్కు పంపడం జరుగుతుంది.

ఆమోదించినవాటి విషయం వారికి తెలియపరుస్తాము.

స్టాంపులతోడి కవర్లు పంపకుండా తర్వాత వాటి విషయమై ఉత్తరాలు వ్రాస్తే ప్రయోజనంలేదు.

—ఎడిటర్



# ఖాసీసుందరి

రారు. భారతదేశంలో హిందీ తరవాత తెలుగు మాట్లాడే వాళ్ల సంఖ్య అధికం.'' చిన్న ఉపన్యాసధోరణిలో చెప్పుకుపోయాడు రాజశేఖరం.

''అలాగా'' అంది కళ్లు పెద్దవి చేసి.

తరవాత నిశ్శబ్దం కాసేపు చికాకు చేసింది.

''మీ పేరు తెలుసుకోవచ్చా?'' అడిగింది.

''నా పేరా? రాజశేఖరరావు! మీ పేరు. . .''

''సిల్వరిన్''

''మీ లాగే మీ పేరుకూడా అందంగా ఉంది'' అభినందించాడు రాజశేఖరం. జవాబుగా హాయిగా నవ్వింది సిల్వరిన్.

''మీరు ఏమీ అనుకోకపోతే, మీరు ఏం చేస్తున్నారో తెలుసుకోవచ్చా?'' అడిగాడు.

''ఈ ఆఫీసు ఎదురుగా ఉన్న టీ స్టాలు మాదే! ఇక్కడ కార్మికులకి పనివాళ్లు టీ సరఫరా చేస్తారు. ఆఫీసులో ఎప్పుడూ నేనో, లేపోతే మా అక్క మేరీయో టీ సరఫరాచేస్తాం'' అంది.

''మీరు ఇంగ్లీషు చాలా చక్కగా మాట్లాడు తున్నారే!''

''మా ఖాసీభాషకి లిపి లేదు. ఆంగ్లేయులు ఇక్కడకు వచ్చిన తరవాత ఖాసీభాషకు మరొక లిపి కనిపెట్టే అవసరం లేకుండా వారి లిపి ఖాసీభాషకు అనుసరింప జేశారు. ఇంగ్లీషు లిపే మా లిపికూడ! లిపితోబాటు ఇంగ్లీషు పదాలు కోకొల్లలుగా మా భాషలో చేరాయి. అందుచేత మా జాతివారందరికీ ఇంగ్లీషు చాలా సులువుగా ఒంటబడుతుంది'' అంది.

''ఓహో! అలాగా!'' వెనక్కి చేతులు కట్టుకొని పెద్దమనిషిలా కనిపించడానికి ప్రయత్నిస్తూ అన్నాడు రాజు

''మాట్లాడినంతవరకూ చాలు! ఏదీ, నువ్వు ఇటు రా, నాయనా ఇంక.'' కోరగా చూస్తూ పిలిచాడు కృష్ణారావు

''సరే! సాయంకాలం మళ్లా కలుద్దాం! ఓ. కే.'' తమాషాగా చేయి ఊపుతూ వెళ్లిపోయింది సిల్వరిన్.

రోజులు గడుస్తున్నాయి. సిల్వరిన్‌తో పరిచయం దినదినాభివృద్ధి పొందసాగింది. క్రమంగా షిల్లాంగు నగరానికి పాతవాడు కాసాగాడు. రోజూ పదిగంటలయే సరికి ఆమె గురించి ఎదురుతెన్నులు చూస్తూ కూర్చునే వాడు. ఆమె అల్లంత దూరాన ఉండగానే ఆమె అడుగుల చప్పుడు పసిగట్టేవాడు. అడుగుల సవ్వడి దగ్గిరవుతూంటే ఆనందం ఉరకలువేసేది. సిల్వరిన్ వచ్చాక ఓ అరగంటవరకు ఎక్కడలేని జోకులు విసురుతూ ఆమెని తెగ నవ్వించేవాడు. ఆమె నవ్వుతూ ఉంటే స్వర్గానుభూతి పొందేవాడు. ఒక్కొక్కప్పుడు కృష్ణారావుకూడా ఓ జోకు విసరటం, ఆమె నవ్వడం కద్దు. కాని కృష్ణారావు జోకుకి సిల్వరిన్ నవ్వితే, ఎవరో తన గుండెలను పిండుతున్నట్లు బాధపడేవాడు.

అక్కడ ఖాసీజాతి ఆచారాల గూర్చి చాలా తెలుసు కున్నాడు. ఖాసీవారిలో ఆస్తిమీద హక్కు ఆడవాళ్లది. పెళ్లయిన తరవాత భర్త భార్య ఇంటికి రావాలి. ఇటువంటి విషయాలు జ్ఞాపకం వచ్చినప్పుడంతా ముసిముసిగా నవ్వుకునేవాడు.

మూడు నెలలు గడిచాయి. ఈమధ్యలో సిల్వరిన్‌ని, ఆమె అక్క మేరీని రెండు మూడుసార్లు సినిమాకి

ఆహ్వానించాడు. పెరుగుతున్న పరిచయంతో రాజశేఖరం ఒక నిర్ధారణకి వచ్చాడు. సిల్వరిన్‌ని పెళ్ళి చేసుకోవాలి. కాని, ఎలాగు? సిల్వరిన్ అపురూప సౌందర్యవతి. తనతో చనువుగా, అభిమానంగా మాట్లాడినంతలో తనని ఆమె ప్రేమించిం దనుకోవడం పొరపాటు. తను అందవికారి కాడు. ఆ మాటకొస్తే తనని తాను పొగుడుకోవడం ఇష్టంలేకగాని, తనకేం? తనూ అందగాళ్లలో జమే! కాని ఆమె అందంతో తన అందం పోల్చితే, నూరు వాట్సు బలుబుకి, అరవై వాట్సు బలుబుకి ఉన్నంత తేడా. పోనీ, ఒకవేళ తనని ప్రేమించిందే అనుకుందాం! అప్పుడు మరో కొన్ని ఇబ్బందులు. మొదటిది: తనదీ, ఆమెదీ ఒకభాషకాదు. రెండవది: కనీసం నివసించే ప్రదేశం ఒకటి కాదు. మూడవది: ఇద్దరి మతం ఒకటి కాదు. ఆమె క్రిస్టియన్; తను హిందువు. కనీసం సంస్కృతి ఒకటి కాదు. ఇన్ని అడ్డంకులు ఉండగా ఎలా జరుగుతుంది ఈ పెళ్లి? జరిగినా, అరమరికలు, కలతలు లేకుండా సంసారం సాగించ గలమా? పరిపరి విధాల ఆలోచించసాగాడు రాజశేఖరం. ఒకపక్కనుండి ఇన్ని ప్రశ్నలు తలెత్తుతున్నప్పటికీ, మరొకపక్క ఆమెని పెళ్లాడితీరాలన్న నిశ్చయం రాజ్యం చేస్తూనే ఉంది.

సిల్వరిన్, రాజశేఖరం బాగా సన్నిహితులయిపోయారు. అతనికి ఖాసీనృత్యంకూడా నేర్పడం మొదలుపెట్టింది. పాశ్చాత్యుల బాల్‌రూమ్ నృత్యానికి, వీరి నృత్యానికి చాలా దగ్గిర పోలికలు కనిపించాయి.

ఖాసీ జాతిలో ఆడవాళ్లని తాకడం తప్పుకాదు. ఈ విషయం తెలిసినా, హైందవ సమాజం నియమించిన కట్టుబాట్లలో పెరిగిన రాజశేఖరం ఆమెని తాకడానికి జంకిపోయేవాడు. ఈ నృత్యం పుణ్యమా అని ఆ అడ్డు తొలగిపోయింది.

ప్రతిరోజూ తన ప్రేమని ఆమెకు వ్యక్తం చేద్దామని బయలుదేరేవాడు. సిల్వరిన్ ఎదురుగా కనిపించే సరికి నోరు మెదపలేకపోయేవాడు.

ఆ రోజు . . . ఆ రోజు ఇప్పటికీ బాగా జ్ఞాపకం ఉంది. ఆ రోజు ఎలాగయినా సిల్వరిన్‌కు తన ప్రేమ వ్యక్తంచేయాలనే స్థిరనిశ్చయానికి వచ్చాడు.

పదిగంట లయింది. సిల్వరిన్ టీతో ప్రవేశించింది. ఆ సమయానికి టైపిస్టు దాస్ స్టోర్సుకౌంటరుమీద నిలబడిఉన్నాడు. అతని జేబులో కొత్తగా కొన్న పెన్ను తళతళ మెరుస్తోంది. కౌంటరు లోపల ఉన్న రాజశేఖరం ఆ పెన్ను లాక్కుని, తిరిగి ఇవ్వకుండా దాస్‌ను ఆటలు పట్టిస్తున్నాడు. పెన్ను ఇమ్మంటూ దాస్ గంతులేస్తున్నాడు. ఈ సన్నివేశంలో సిల్వరిన్ టీ కప్పుతో స్టోర్సు లోపలికి వచ్చింది. రాజశేఖరం ఆమెను చూచి, దాస్‌ను మరికొంచెం ఏడిపించే ఉద్దేశ్యంతో, "ఈ పెన్ను నీకు కావాలా?" అని గంభీరంగా ముఖం పెట్టి అడిగాడు.

దాస్ ఏడవలేక నవ్వుతూ నిలబడి చూస్తున్నాడు. రాజశేఖరం అడిగినదానికి బదులుచెప్పకుండా, "షివ్" అంటూ టీ అందించింది. రాజశేఖరం టీ అందుకుంటూ మళ్లా "ఈ పెన్ను నీకు కానుకగా ఇస్తున్నాను!" అన్నాడు.

"ఆ పెన్ను నాది." ఆక్రోశించాడు దాస్.

సిల్వరిన్ విందుగా నవ్వుతూ తాపీగా నిలబడిఉంది.

రాజశేఖరం లేని గంభీరత మరికొంచెం తెచ్చుకుని, "అయితే నే విచ్చే కానుక తీసుకోవా?" అన్నాడు.

ఈ మాటతో సిల్వరిన్ ముఖంలో నవ్వు మాయ మయింది. నిశ్చలమయిన గంభీరత చోటు చేసుకుంది. ఈ మార్పు చూసి రాజశేఖరం చలించాడు. అసభ్యంగా మాట్లాడానేమోనని తను అన్నమాటలన్నీ సింహావలోకనం చేసుకున్నాడు. 'దాస్‌ని ఆటలు పట్టించడానికి ఇలా అంటున్నానని ఆమెకుమాత్రం తెలియదేమిటి?' అనుకున్నాడు.

సిల్వరిన్ ముఖం కందిపోయింది. ఆమె పెదవులు, నాసిక చిన్నగా వణకడం గమనించాడు. రాజశేఖరానికి ఆమె ప్రవర్తన అంతుపట్టలేదు. నవ్వుతో నిండిన వాతావరణం ఒక్కసారిగా గంభీరత దాల్చింది. ఇక దాస్‌ని ఆటలు పట్టిద్దామనే ఉద్దేశం సహజంగా చచ్చిపోయింది.

సిల్వరిన్ వెళ్లిపోయిన వెంటనే దాస్, "నా పెన్ను నా కిస్తావా, చస్తావా" అంటూ పని మానేసి కూర్చున్నాడు.

ఆమెదగ్గిరికి వెళ్లి పెన్ను తీసుకుని ఇచ్చేద్దామను కున్నాడు. 'ఇందాకే ఆ పని చేసిఉంటే బాగుండేది. నిజానికి మళ్లీ పెన్ను అడగడానికి ధైర్యం చాలడం లేదు. ఆవిడ ప్రవర్తన అదోలా ఉంది మరి. నిజంగా ఆ పెన్ను తనకి కానుకగా ఇచ్చాననుకుందేమో!

ఎలా గనుకుంటుంది, దాస్ అక్కడ నిలబడి ఆ పెన్ను నాది బాబోయ్ అని గోలపెడుతుంటే!' తలపోశాడు.

దాస్ గొడవ పడలేక, సిల్వరిన్‌ని పెన్ను అడగలేక దాని ఖరీదు దాస్‌కి చెల్లించి, మరోటి కొనుక్కోమని బతిమలాడి నచ్చచెప్పాడు.

పన్నెండు గంటలకి ఆఫీసు అవగానే భోజనానికి



ప్రాచ్య శిల్పం ప్రతికృతి

— జి. యస్. లత (మద్రాసు - 2)

"పోనీలే, అక్కరలేకపోతే!" పెన్ను ఉన్న చేతిని వెనక్కు తీసుకున్నాడు.

ఆమె తల వంచుకుని చేయి చాచింది. అప్రయత్నంగా రాజశేఖరం పెన్ను అందించాడు. ఆమె అందమయిన నీలిరంగు కళ్లెత్తి రాజా కళ్లలోనికి చూస్తూ అందు కుంది. ఆ పెన్ను జాగ్రత్తగా తన గౌను జేబులో పదిలపరచుకుంది. రాజశేఖరం ఆమె వింతప్రవర్తన గూర్చి ఆలోచిస్తూ టీ తాగడం పూర్తిచేశాడు. ఖాళీ అయిన కప్పుని ఆమె అందుకుని రాజశేఖరం పిలుస్తూ ఉన్నా మళ్లీ వస్తానంటూ బయటకు రివ్వున పారి పోయింది. ఆఫీసురూమ్ పక్కనుండి గేటువేపు వెళ్లుతూ కిటికీ దగ్గిర ఆగి, ఒయ్యారంగా కళ్లు తిప్పి రాజశేఖరాన్ని చూచింది. అతను చేతితో రమ్మని సంజ్ఞ చేశాడు. అతని సంజ్ఞకు పట్టరాని సంతోషంతో నవ్వుతూ బయటికి పారిపోయింది.

వెళ్లి ఒంటిగంటకు తిరిగి వచ్చాడు. కృష్ణారావు పనిమీద బజారుకు వెళ్లాడు. స్టోర్సు తాళం తీసి లోనికి వెళ్లి కౌంటరుమీద కూర్చున్నాడు. ఎదురుగా ఆఫీసు గది ఖాళీగా ఉంది. వెళ్లినవాళ్లు ఇంకా తిరిగి రాలేదు.

సిగరెట్టు వెలిగించి పొగ రింగులుగా వదులుతూ, వాటిగుండా తదేకంగా చూస్తున్నాడు ఎవరికోసమో?

"రావ్‌బాబు ఎక్కడ" అంటూ మేరీ గంతు లేసుకుంటూ వచ్చి కౌంటరుమీద నిలబడింది. మేరీ చెల్లెలు సిల్వరిన్‌కన్నా పది సంవత్సరాలు పెద్దదిగా ఉంటుంది. నలుగురు పిల్లలు. ఎప్పుడూ నవ్వుతూ, తుళ్లుతూ ఖుషీగా ఉంటుంది.

"ఏమిటి, రావ్‌బాబూ, ఈమధ్య నువ్వు మా చెడ్డ దొంగవయిపోతున్నావ్ సుమా!" లేని గంభీరత తెచ్చుకుంటూ హాస్యమాడింది.

ఈ మాటతో రాజశేఖరం గుండె గతుక్కుమంది. మేరీ సాధారణంగా ఇలాగే మాట్లాడుతుంది. కాని ఇవాళ నవ్వీరావడంతో ఇలా అందుకుందేమిటి?

"నేను దొంగనని నీకు ఇప్పటివరకూ తెలియదా?" గుండెలలో గుబులు దాచుకుంటూ, బలహీనంగా నవ్వి ప్రతిహాస్యమాడాడు.

"అవునుగాని, నువ్వు మా చెల్లెలితో ఏమిటన్నావో, నా కంతా చెప్పేసిందిలే." తమాషాగా కళ్ళు తిప్పుతూ అంది మేరీ.

"ఏమిటి చెప్పింది? ఆత్రతగా అడిగాడు.

"నీకు తెలియదూ?నన్నడుగుతున్నావ్!" గద్దించింది.

కంగారులో ఆ గద్దింపు వెనక వేళాకోళముందని గుర్తించలేకపోయాడు. మిన్ను విరిగి మీద పడిన ట్లయింది. తను సిల్వరిన్‌తో అసభ్యంగా ప్రవర్తించలేదే! ఎంత ప్రయత్నించినా గుండె నిబ్బరం చేసుకోలేక పోయాడు. ఎక్కడ ఏ అపవాదు మీద పడుతుందోనని బెదిరిపోయాడు.

"అబ్బే, నేను ఏమీ చెప్పలేదే!" భయపడుతూ దీనంగా అన్నాడు రాజశేఖరం.

మేరీ కనుబొమలు ముడివడ్డాయి. "అయితే, నువ్వు పెన్ను దేనికి ఇచ్చావు?" ఈ మాటమాత్రం నిర్లక్ష్యంగానే అడిగింది. వేళాకోళం పాలు ఇసుమంతకూడా లేదు.

రాజశేఖరం మనస్సు కళ్లెంలేని గుర్రం అయింది. ఆ తత్తరపాటులో పరిణామాలను భయంకరంగా చిత్రించుకోసాగాడు. చిరుచెమటలు పట్టాయి. అప్పుడే తనని మంచి వ్యక్తిత్వం లేనివాడుగా అందరూ పరిగణిస్తున్నట్లు బెంగపడిపోయాడు.

నిస్సహాయతతో, తన నిజాయితీని ఋజువు చేసుకోడానికి పెన్ను ఉదంతమంతా ఏకరువుపెట్టాడు.

మేరీ అంతా విని కొద్ది క్షణాలు మాట్లాడ లేకపోయింది. చివరికి శక్తిని కూడదీసుకుని, "అది చిన్నపిల్ల! దానికేమీ తెలియదు! సిల్వరిన్‌తో ఎప్పుడూ ఇటువంటి వేళాకోళాలాడకు." ఈ మూడు వాక్యాలు మూడు మణుగుల బరువు తలకెత్తుకున్నట్లు అంది.

రాజశేఖరం అర్థంకాక పిచ్చివాడిలా చూడసాగాడు. మేరీ భారంగా వెనుతిరిగింది. "పెన్ను పెట్టుకొనిస్తాను ఉండు" అని ముందుకు సాగింది.


పాకెట్ ప్రెస్



పేర్లు, చిరునామాలు, ఉత్తరాలు, లేబిల్సు వగైరాలను దీని సహాయంతో ఇంట్లోనే చక్కగా ముద్రించుకొనవచ్చును. నం. 1 రు. 3–25. నం. 2 రు. 3—90. నం. 3 రు. 4—95. స్పెషల్ రు. 6—95. అత్యుత్తమమైనది రు. 9—95 లు. ఉత్తమ తరగతికి మిక్కిలి పెద్ద సైజు రు. 12-95. పోస్టేజి రు. 2-50.

AMERICAN STORES (P.A. 13)
788/12/1/C.,
Gopal Lal Thakur Road, Calcutta-36


కోరికలు

సహజప్రకృతివల్లగాక చదువు వల్లనే, అలవాట్లవల్లనే ముఖ్యంగా మనలో కోరికలు తలెత్తుతున్నాయి.

—ఫీల్డింగ్

ఆలోచన

ఆలోచన అంటే ఆత్మ తనతో తాను మాట్లాడుకోవడమే.

—ప్లేటో

"పోనీ, ఆ పెన్ను సిల్వరిన్ దగ్గిర ఉండనివ్వు." జంకుతూ అన్నాడు రాజశేఖరం.

మేరీ ఆ మాట వినిపించుకోలేదు. వెళ్లిపోయి నవెంటనే తిరిగివచ్చి పెన్ను ఇచ్చేసి వెళ్లిపోయింది. ఆమెను పలకరించడానికి భయమేసింది. ఆమె మళ్లీ ఏమీ అనలేదు.

కృష్ణారావు వచ్చిన తరవాత అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. ఇందులో తన తప్పేమీ లేదని కృష్ణారావు నిర్ణయించిన పిదప రాజశేఖరం మనస్సు కొంచెం శాంతించింది.

ఆ తరవాత పది రోజులవరకు సిల్వరిన్ కనిపించ లేదు. టీ స్టాలుకుకూడా వచ్చేదికాదు.

ఏ రోజునయితే తన ప్రేమను వ్యక్తం చేయాలని ఒక దృఢనిశ్చయానికి వచ్చాడో, ఆనాడే ఆమెకు, తనకు మధ్య పూడ్చలేని అగాధం ఏర్పడింది. హృదయమంతా ముక్కలయిపోయింది. షిల్లాంగులో ఏ ప్రదేశంలోకి వెళ్లినా సిల్వరిన్ జ్ఞాపకాలు ముసిరి పిచ్చెత్తించ సాగాయి.

సిల్వరిన్ క్రమంగా టీ స్టాలుకు రావడం ప్రారంభించింది. తనని చూచినా చూడనట్లు నటించేది. మాట్లాడటానికి అవకాశం ఇచ్చేదికాదు. ఒకటి రెండుమార్లు టీ స్టాలులోనికి వెళ్లి కూర్చున్నాడు. ఎక్కడ మాట్లాడబడుతుందోనని, పక్క టీ స్టాలులోని కెళ్లి అక్కడ ఉన్న అమ్మాయిలతో బాతాఖానీ పెట్టేది. ఇలా ఒక నెల రోజులు గడిచిపోయాయి. జీవితం దుర్భరంగా తోచసాగింది.

ఈ తరుణంలో కృష్ణారావుకు ఒరిస్సాలో ఓ మంచి బాంకులో ఉద్యోగం దొరికింది. కంపెనీ ఉద్యోగానికి కృష్ణారావు రాజీనామా ఇచ్చాడు. తనని ఇక్కడ పనిచేస్తూ మంచి ఉద్యోగంకోసం ప్రయత్నించమని సలహా ఇచ్చాడు కృష్ణారావు. కాని రాజశేఖరం ఒప్పుకోలేదు. ఆ ప్రయత్నించేదేదో ఇంటిదగ్గిర కూర్చుని చేద్దామని తీర్మానించుకుని రాజశేఖరంకూడా రాజీనామా ఇచ్చాడు.

షిల్లాంగునుండి వెళ్లిపోయే రోజున అనుకోకుండా రోడ్డుమీద సిల్వరిన్ ఒంటరిగా తారసపడింది. కృష్ణారావు ఆమెను ఆపి, "ఇవాళ సాయంకాలం ఈ ఊరు వదిలి వెళ్లిపోతున్నాం" అన్నాడు.

"మా అక్క చెప్పింది" అంది ముక్తసరిగా.

"సిల్వరిన్, నేను నీతో ఎప్పుడూ అమర్యాదగా ప్రవర్తించలేదు గదా!"

'లేదు' అన్నట్లు తలూపింది.

"ఆ రోజు నిన్ను ఏదో అన్నానని మా అక్కతో చెప్పావట!"

"అబ్బే, నువ్వు పెద్దగా అన్నావని నేను చెప్పలేదే!" అంది.

పైకి తాపీగా మాట్లాడుతున్నా మనస్సులో తీవ్ర సంచలనం కలుగుతూందని ఆ ముఖం చెబుతూంది.

"సరే, మేము వెళ్లిపోతున్నాం. బహుశా ఈ జన్మలో మళ్లీ మనం ఒకరి నొకరు చూచుకోవడం పడకపోవచ్చు. ఎప్పుడయినా నేను జ్ఞాపకంవస్తే చీదరించుకోకు సుమా!" రాజశేఖరం గొంతు బొంగురు పోయింది.

"మరి, వస్తాం!" అంటూ కృష్ణారావు ముందుకు సాగాడు.

సిల్వరిన్ గుడ్లలో నీరు కుక్కుకుంటూ వడిగా వెళ్లిపోయింది.

బరువైన హృదయంతో షిల్లాంగు వదిలాడు రాజశేఖరం. కొన్ని సంవత్సరాలవరకూ సిల్వరిన్ రూపం మనసునుండి దూరం కాలేదు. కాలక్రమేణా ఆమె జ్ఞాపకాలు కాలచక్రంలో కలిసిపోయాయి.

ఎనిమిది వసంతాలు దొర్లిపోయాయి. ఇప్పుడు రాజశేఖరం వయస్సు ఇరవైఎనిమిది. మనసుకు నచ్చిన కన్యను వివాహమాడాడు. మంచి ఉద్యోగంలో ఆంధ్ర ప్రదేశ్‌లో స్థిరపడ్డాడు.

వివాహానంతరం రాజశేఖరానికి జ్ఞాపకం ఉన్నంత వరకూ సిల్వరిన్ ఏనాడూ జ్ఞాపకం రాలేదు. అథవా వచ్చినా తనని ఒక అసభ్యవ్యక్తిగా పరిగణించిన ఆమెపై క్రోధం, అసహ్యం కలిగేవి. వెంటనే ఆమెను తన స్మృతిపథంలోనుండి నెట్టివేసేవాడు.

ఆ రోజు ఆదివారం. బాల్యస్నేహితుడు రంగనాథం ఇంటికి వెళ్లాడు రాజశేఖరం. రంగనాథం లోపల స్నానం చేస్తున్నాడు. స్నేహితునికోసం ఎదురు చూస్తూ డ్రాయింగ్‌రూంలో కూర్చున్నాడు. ఎదురుగా టేబిలుమీద "వివాహాలు – వింత ఆచారాలు" అనే పుస్తకం కనిపించింది. ఉబుసుపోకకు పుస్తకం తీసి పేజీలు తిరగవేయసాగాడు.

అందులో ఒక పేజీదగ్గిర అతని దృష్టి టక్కున ఆగిపోయింది. ఇలా చదవసాగాడు: "ఖాసీ గారో కొండలమీద నివసించే కొండజాతిని ఖాసీలంటారు. పెద్దల ప్రమేయం లేకుండా యువతీ యువకులే తమ జీవిత భాగస్వాములను ఎన్నుకుంటారు. యువకుడు తాను ప్రేమించిన యువతికి ఏదో ఒక కానుక ఇస్తాడు. ఆ కానుక ఆమె స్వీకరిస్తే, ఆమె అతనిని ప్రేమిస్తుందని అర్థం."

రాజశేఖరం హృదయంలో అగ్నిపర్వతాలు బద్దలయ్యాయి. ఆనాటి పెన్ను సంఘటన, మేరీతో సంభాషణ, సిల్వరిన్‌తో వీడ్కోలు సంభాషణ మదిలో మెదిలాయి.

రెండు వేడి కన్నీటిబొట్లు పుటమీద రాలాయి. అక్షరాలు పూర్తిగా కనిపించలేదు. [illegible] కళ్ళు అద్దుకుంటూ పుస్తకం [illegible] ★